కార్మిక వ్యతిరేక చట్టాలను రద్దు చేయాలి

సీతంపేట: కార్మికుల కోర్కెల దినోత్సవాన్ని పురస్కరించుకుని కార్మిక వ్యతిరేక లేబర్‌కోడ్‌లను రద్దు చేయాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం స్థానిక రెవెన్యూ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ శాఖ జిల్లా అధ్యక్షుడు దావల రమణారావు మాట్లాడుతూ.. కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం కార్మిక వ్యతిరేక చట్టాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సమాన పనికి సమాన వేతనం చెల్లించాలన్నారు. రాష్ట్రంలో కాంట్రాక్ట్ కార్మిక సమస్యలు పరిష్కరించాలని కోరారు. అనంతరం పలు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ మహేష్‌కు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు బి.పార్వతి, దర్మమ్మి, శాంతకుమారి, సత్యవతి, రత్నాలు, కమల, రోయిబారమ్మ, శ్రీదేవి, తదితరులు పాల్గొన్నారు.

● సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా...

పాలకొండ: కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధాలను తిప్పికొడతామని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దావాల రమణారావు అన్నారు. ఈ మేరకు స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీజేపీ కార్మిక వ్యతిరేక చట్టాలు అమలు చేయాలని చూస్తోందని ఆరోపించారు. కార్మికుల హక్కులను కాలరాయడంతో పాటు ప్రభుత్వ ఆస్తులను అమ్మేయాడానికి ప్రయత్నిస్తోందని మండిపడ్డారు. ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేట్‌పరం చేసి కార్మికుల పొట్ట కొడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే కేంద్ర ప్రభుత్వం కార్మిక వ్యతిరేక చట్టాలను రద్దు చేయాలని కోరారు.


వీరఘట్టం: డిప్యూటీ తహసీల్దార్ కుమారస్వామికి వినతిపత్రం ఇస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది


గరుగుబిల్లి: తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో ధర్నా చేస్తున్న సీఐటీయూ నాయకులు


భామిని: డీటీ శేఖరంనకు వినతిపత్రం అందిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు బి. అమరవేణి, కాద రాము, ఎన్. హిమప్రభ, జి. జెస్సీబాయ్, కె. గౌరీశ్వరి, తదితరులు పాల్గొన్నారు.

● 'ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి'

వీరఘట్టం: అంగన్‌వాడీ సిబ్బందిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని కోరుతూ పలువురు సిబ్బంది సీఐటీయూ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ పార్వతీపురం మన్యం జిల్లా కార్యదర్శి ఎన్.సింహాచలం మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న కార్మిక వ్యతిరేక చట్టాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం పలు సమస్యలను పరిష్కరించాలని కోరుతూ డిప్యూటీ తహసీల్దార్ కుమారస్వామికి వినతిపత్రం అందజేశారు.

ప్రభుత్వోద్యోగులుగా గుర్తించాలి..

భామిని: సమస్యలు పరిష్కరించాలని కోరుతూ అంగన్‌వాడీ కార్యకర్తలు డిప్యూటీ తహసీల్దార్ నిమ్మల శేఖరంనకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, తమను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించడంతో పాటు మెరుగైన వేతనాలు, గ్రాట్యుటీ అమలు చేయాలని డిమాండ్ చేశారు.

గరుగుబిల్లి: కార్మికుల సమస్యల పరిష్కారానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చొరవ చూపాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి బీవీ రమణ కోరారు. కార్మికుల సమస్యలపై సీఐటీయూ ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట బుధవారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా కార్మిక వ్యతిరేక చట్టాలను రద్దు చేయాలని, స్కీమ్ వర్కర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని, కనీస వేతనం రూ.26వేలు చెల్లించాలని, ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణ నిలిపివేయాలని డిమాండ్ చేశారు. అలాగే విద్యుత్, ఆశా, కమ్యూనిటీ హెల్త్ వర్కర్లు, కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని కోరారు. అసంఘటిత రంగ కార్మికుల సంక్షేమానికి సమగ్ర చట్టం చేయాల డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ కె.జయకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ నాయకులు సీహెచ్.గౌరమ్మ, కృష్ణవేణి, సత్యవతి, స్వాతి తదితరులు పాల్గొన్నారు.



పాలకొండ: ధర్నా చేస్తున్న సీఐటీయూ, కార్మిక సంఘాల నాయకులు


సీతంపేట:తహసీల్దార్ మహేష్‌కు వినతిపత్రం ఇస్తున్న సీఐటీయూ నాయకులు

క్లుప్తంగా

కూర్మావతారంలో జగన్నాథుడు



పాలకొండ : జగన్నాథస్వామి రథయాత్ర ఉత్సవాల్లో భాగంగా జగన్నాథుడు బుధవారం కూర్మావతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా అర్చకులు విశ్వనాథం దాస్ స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పరిసర గ్రామాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు. గురువారం హీరాపంచమి సందర్భంగా వేలాది మంది భక్తులు స్వామివారిని దర్శించుకునేందుకువచ్చే అవకాశం ఉన్నందున ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు ఈఓ సర్వేశ్వరరావు తెలిపారు.

నిరసన


నిరసన తెలియజేస్తున్న ఎస్ఎస్ఏ ఉద్యోగులు

సీతంపేట: సమస్యలు పరిష్కరించాలంటూ రాష్ట్ర జేఏసీ పిలుపు మేరకు ఏపీ సమగ్ర శిక్షా కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ ఉద్యోగులు బుధవారం మధ్యాహ్న భోజన సమయంలో స్థానిక ఎంఆర్‌సీ వద్ద ప్లకార్డులు పట్టుకుని నిరసన వ్యక్తం చేశారు. మే, జూన్ నెలల పెండింగ్ వేతనాలు చెలించాలని.. అన్ని విభాగాలకు మినిమమ్ టైమ్ స్కేల్, డీఎస్సీలో అర్హత కలిగిన ఉద్యోగులకు వెయిటేజ్ ఇవ్వాలని కోరారు. ఎన్నికల హామీ మేరకు అన్ని సంక్షేమ పథకాలు వర్తింపజేయాలన్నారు. కార్యక్రమంలో సిబ్బంది నిమ్మక శ్రీనివాస్, నిరంజన్, ధవళేశ్వరరావు, హేమలత, శశికళ, సుజాత, మోహన్, రాములు, రాజ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య పనులపై ప్రత్యేక దృష్టి



మాట్లాడుతున్న ఎంపీడీఓ కిశోర్‌కుమార్

భామిని : వాతావరణం మార్పులు చోటుచేసుకుంటున్న నేపథ్యంలో అంటురోగాలు ప్రబలే అవకాశం ఉందని, వెంటనే గ్రామాల్లో పారిశుధ్య పనులు చేపట్టాలని ఎంపీడీఓ ఎం.కిశోర్‌కుమార్ అన్నారు. బుధవారం స్థానిక మండల పరిషత్‌కార్యాలయంలో కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, శానిటేషన్ డ్రైవ్ నిర్వహిస్తున్నందున ప్రతి గ్రామంలో తనిఖీలు నిర్వహిస్తామన్నారు. తాగునీటి సమస్య లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో కార్యదర్శులు, ఇంజినీరింగ్ సహాయకులున్నారు.

నేడు బహిరంగ వేలం

పార్వతీపురం టౌన్: ఐడీఎస్ఎంటీ షాపు గుత్తకు ఇచ్చేందుకు బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి పురపాలక సంఘం ఆధీనంలో ఉన్న ఐడీఎస్ఎంటీ షాపు రూమ్‌లలో ప్రస్తుతం ఖాళీగా ఉన్న 22,32,35,44,46 రూమ్‌లను గుత్త నిబంధనల ప్రకారం ఇచ్చేందుకు బహిరంగ వేలం ఈ నెల11న ఉదయం 11గంటలకు వేలం పాట వేయనున్నామని పేర్కొన్నారు. అలాగే పురపాలక సంఘం ఆధీనంలో గల రోజువారీ మార్కెట్, రోడ్డు మార్జిన్ నందు ఆసీలు, కమేశాల్లో ఆసీలు వసూలు చేసుకునే హక్కు కోసం కూడా బహిరంగ వేలం గురువారం మధ్యాహ్నం 12గంటలకు పురపాలక సంఘం కార్యాలయ ఆవరణలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి గల వారు బహిరంగ వేలంలో పాల్గొనాలని కోరారు. పూర్తి వివరాల కోసం కార్యాలయం పని వేళల్లో సంప్రదించ గలరని తెలియజేశారు.

అందుబాటులో ఎరువులు


లచ్చయ్యపేట రైతు సేవాకేంద్రంలో ఎరువులు పంపిణీ చేస్తున్న ఏఓ ఎస్.అవినాష్

సీతానగరం: మండలంలో ఖరీఫ్ సాగు చేయడానికి రైతులకు అవసరమైన ఎరువులు రైతు సేవా కేంద్రాల్లో అందుబాటులో ఉన్నాయని ఏఓ ఎస్. అవినాష్ అన్నారు. ఈ మేరకు బుధవారం ఆయన లచ్చయ్యపేటలో వరివెదలు వేసిన రైతులకు ఎరువులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఖరీఫ్‌సీజన్ రావడం, అరకొరగా వర్షాలు కురవడం వల్ల వరి వెదలు, జొన్న, చెరకు పంటలు సాగు చేస్తున్న రైతులు ఎరువులు వేయడానికి ఇదే అదును కావడంతో ఎరువుల కోసం ఎదురు చూస్తున్నారని, వారి అవసరాలకు అనుగుణంగా గ్రామాల్లో నిల్వ ఉంచినట్లు తెలిపారు. నాలుగు రోజులుగా ఎరువులు పంపిణీ చేస్తున్నట్లు తెలియజేశారు.

బాధ్యతగా వ్యవహరించాలి



వాహనచోదకులు, ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్న న్యాయమూర్తి

● న్యాయమూర్తి విజయరాజ్‌కుమార్

పాలకొండ రూరల్ : రోడ్డు ప్రమాదాల నివారణలో భాగంగా ప్రతిఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని పాలకొండ జూనియర్ సివిల్‌కోర్టు న్యాయమూర్తి ఎ.విజయ రాజ్‌కుమార్ అన్నారు. బుధవారం స్థానిక పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఆటో డ్రైవర్లు, పలు మోటార్ వెహికల్స్‌కు చెందిన యూనియన్ల సభ్యులతో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కొత్త చట్టాలు అమల్లోకి వచ్చిన నేపథ్యంలో రోడ్డు ప్రమాదాలకు కారణమయ్యే వారికి తీవ్రమైన శిక్షలు పడే అవకాశం ఉందన్నారు. సీఐ మీసాల చంద్రమౌళి మాట్లాడుతూ.. ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, అధిక లోడు, మితిమీరిన వేగం, మద్యం సేవించి, కాలం చెల్లిన వాహనాలు నడపడం, మైనర్లకు వాహనాలు ఇవ్వడం నేరమన్నారు. ప్రమాదం జరిగిన వెంటనే 100కు సమాచారం ఇవ్వడం ద్వారా పలు శాఖల యంత్రాంగం స్పందిస్తుందని చెప్పారు. కార్యక్రమంలో ఎస్సై ఎస్.ప్రశాంత్, న్యాయవాదులు పల్లా మునిస్వామి, కర్రా రవికుమార్, మరిచర్ల జగన్‌మోహనరావు, బి.రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

నిరంతర పర్యవేక్షణ అవసరం

● ఎంపీడీఓ రామకృష్ణ

పాలకొండ రూరల్: గ్రామాల్లో సేవలు అందిస్తున్న సిబ్బంది ప్రజల యోగక్షేమాలపై నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని ఎంపీడీఓ ఎస్.రామకృష్ణ అన్నారు. మండలంలోని తంపటాపల్లి, తుమరాడ గ్రామాలను బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో తాగునీటి వనరులపై ఆరా తీశారు. అలాగే పారిశుధ్య నిర్వహణ, మౌలిక వసతుల తాజా పరిస్థితులను క్షుణ్ణంగా పరిశీలించారు. ప్రస్తుత వర్షాకాల సీజన్‌లో వ్యవహరించాల్సిన విధివిధానాలపై ఆయా సచివాలయాల సిబ్బందికి, పంచాయతీ కార్యదర్శులకు వివరించారు. విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవన్నారు.


తుమరాడలో గ్రామస్తులు, సచివాలయ సిబ్బందితో మాట్లాడుతున్న ఎంపీడీఓ రామకృష్ణ

నిర్లక్ష్యం తగదు

పాలకొండ రూరల్: పెట్రోల్ ఫిల్లింగ్ స్టేషన్ల వద్ద ఆయిల్ కోసం వచ్చేవారు, వాహనాల్లో ఆయిల్ వేసే సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ప్రమాదాలు తప్పవని పాలకొండ అగ్నిమాపక అధికారి జామి సర్వేశ్వరరావు అన్నారు. సీతంపేట రహదారిలో గల పెట్రోల్‌బంక్‌లో ఐటీడీఏ నేతృత్వంలో అగ్ని ప్రమాదల నివారణ, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వాహన చోదకులు, సిబ్బందికి బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సర్వేశ్వరరావు మాట్లాడుతూ, వాహనంలో ఆయిల్ వేస్తున్న సమయంలో సెల్ వినియోగం వల్ల రేడియేషన్ అధికమై మంటలు వ్యాపించే ప్రమాదముందన్నారు. ఈ విషయంలో వాహనదారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అలాగే బంకుల్లో ఫైర్ సేఫ్టీ, స్మోకింగ్ యంత్రాలు, ఇసుక బకెట్లు అందుబాట్లో ఉంచుకోవాలని సూచించారు.


ఫైర్‌సేఫ్టీ పరికరాల వినియోగంపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

మినిట్స్ కాపీలోని అంశాలను అమలు చేయాలి

గుమ్మలక్ష్మీపురం: గత ప్రభుత్వం అంగన్‌వాడీ ఉద్యోగులకు ఇచ్చిన మినిట్స్‌లోని అంశాలను కూటమి ప్రభుత్వం అమలుచేయాలని సీఐటీయూ నాయకులు మండంగి రమణ, సన్యాసిరావులతో పాటు అంగన్‌వాడీ యూనియన్ నాయకులు వై.కస్తూరి, కుమారి, సుధ తదితరులు డిమాండ్ చేశారు. అఖిల భారత కోర్కెల దినం సందర్భంగా సీఐటీయూ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కార్యకర్తలు బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరశన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఐసీడీఎస్‌ను బలోపేతం చేయాలని, బడ్జెట్ పెంచాలని, ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యూటీ అమలు చేయాలని, ఐఎల్‌సీ సిఫార్సుల ప్రకారం కనీసం వేతనం రూ.26,000, పెన్షన్, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ రామారావుకు అందజేశారు.


తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీఐటీయూ నాయకులు, అంగన్‌వాడీ కార్యకర్తలు

నవధాన్యాల సాగుతో భూసారం

గరుగుబిల్లి: నవధాన్యాల సాగుతో భూసారాన్ని పెంపొందించుకోవాలని ప్రకృతివ్యవసాయ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ పి.షణ్ముఖరాజు అన్నారు. మండలంలోని తోటపల్లి పంచాయతీ నందివానివలస గ్రామంలో ప్రకృతి వ్యవసాయ విధానంలో సాగు చేస్తున్న నవధాన్యాల పంటను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. నవధాన్యాల సాగు చేయడం వల్ల బహుళ ప్రయోజనం కలుగుతుందన్నారు. తక్కువ పెట్టుబడితో ఎక్కువ దిగుబడులు సాధించడానికి ఎంతో ఉపయుక్తకరంగా ఉంటుందన్నారు. ప్రకృతి వ్యవసాయ విధానాన్ని రాష్ట్ర ప్రభుత్వం కూడా ప్రోత్సహిస్తోందన్నారు. కార్యక్రమంలో ఎన్ఎఫ్ఏ జి.అన్నపూర్ణ, అప్పలనాయుడు, ప్రదీప్, సన్యాసినాయుడు, తదితరులున్నారు.


నవధాన్యాల పంటను పరిశీలిస్తున్న డీపీఎం షణ్ముఖరాజు

13న బహిరంగ వేలం

వీరఘట్టం: వీరఘట్టం మేజర్ పంచాయతీకి చెందిన 18 షాపులను అద్దెకు ఇచ్చేందుకు ఈనెల 13న ఉదయం 9 గంటలకు పంచాయతీ కార్యాలయం వద్ద బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు ఈఓ రాము బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక అంబేడ్కర్ జంక్షన్‌లో, పంచాయతీ కార్యాలయం ఎదురుగా ఉన్న షాపులకు వేలంపాట నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్నవారు వేలంపాటలో నేరుగా పాల్గొనాలని కోరారు. పూర్తి వివరాలకు పంచాయతీ ఆఫీసు పనివేళల్లో సంప్రదించాలని కోరారు.

సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలి


తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న సీఐటీయూ నాయకులు, అంగన్‌వాడీ సిబ్బంది

కొమరాడ: సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని సీఐటీయూ నాయకుడు కొల్లు సాంబమూర్తి డిమాండ్ చేశారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద అంగన్‌వాడీ, ఆశా వర్కర్లతో కలిసి బుధవారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ యూనియన్ నాయకులు అనురాధ, జ్యోతి మాట్లాడుతూ.. అంగన్‌వాడీ, ఆశా వర్కర్లకు ఉద్యోగ భద్రత, ఇతర సౌకర్యాలు కల్పించాలని, వారిపై కక్షపూరిత చర్యలు మానుకోవాలని కోరారు. అవుట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ ఆర్.రమేష్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో అసంఘటిత కార్మికలతో పాటు పలు శాఖల్లో పనిచేస్తున్న అవుట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ సిబ్బంది పాల్గొన్నారు.

అంగన్‌వాడీల నిరసన


తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

కురుపాం: సమస్యల పరిష్కారం కోరుతూ అంగన్‌వాడీ కార్యకర్తలు సీఐటీయూ ఆధ్వర్యంలో బుధవారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకులు సరళకుమారి, జె.సరోజ మాట్లాడుతూ.. లేబర్ కోడ్స్‌ను వెంటనే రద్దు చేయాలని, ప్రైవేటీకరణను, జాతీయ నగదు బదిలీకరణ పథకాన్ని నిలుపుదల చేయాలని, అంగన్‌వాడీలను ప్రభుత్వ కార్మికులుగా గుర్తించాలని, కనీస వేతనం నెలకు రూ.26000 చొప్పున అందించాలని, పెన్షన్ అందించి సామాజిక భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ సత్యనారాయణకు వినతిపత్రం అందజేశారు.

పండ్ల మొక్కలు నాటడానికి ఏర్పాట్లు


మాట్లాడుతున్న ఏపీఓ తులసీదాస్, ఈసీ రమణమూర్తి

భామిని: ఉపాధి హామీ పథకం ద్వారా పని దినాలు తగ్గకుండా పండ్లతోటల పెంపకానికి అనువుగా గోతులు సిద్ధం చేయించాలని ఉపాధి ఏపీఓ ఈ.తులసీదాస్ అన్నారు. మండలకేంద్రంలోని ఉపాధి కార్యాలయంలో టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మండలంలో గుర్తించిన 150 ఎకరాల్లో పండ్ల మొక్కలు పెంచేందుకు గోతులు తీయించాలని సూచించారు. ఇప్పటికే జీడి,మామిడి, కొబ్బరి, తదితర మొక్కలు సిద్ధంగా ఉన్నట్లు చెప్పారు. సమావేశంలో ఈసీ రమణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

గిరిజనోద్యమ నాయకుల ఆశయాలు కొనసాగిద్దాం..

కురుపాం: శ్రీకాకుళ సాయుధ రైతాంగ పోరాటంలో అశువులు బాసిన గిరిజనోద్యమ నాయకులు వెంపటాపు సత్యం, ఆదిభట్ల కైలాసం ఆశయ సాధనకు అంతా కృషి చేయాలని ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి అన్నారు. గుమ్మ గ్రామంలో వెంపటాపు, ఆదిభట్ల 53వ వర్ధంతిని బుధవారం నిర్వహించారు. వారి విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నాటి గిరిజనోద్యమ నాయకుల పోరాట ఫలాలను నేడు మనం అనుభవిస్తున్నామన్నారు. వారి ఆశయాలను కొనసాగించేందుకు అంతా కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ వెంపటాపు భారతి, గిరిజన సంఘం, సీపీఐ, సీపీఐ ఎంఎల్ నాయకులు పాల్గొన్నారు.


నినాదాలు చేస్తున్న ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి, తదితరులు

రుణ అర్హతకార్డుతో సంక్షేమ పథకాలు

● డిప్యూటీ తహసీల్దార్ కుమారస్వామి

వీరఘట్టం: రుణ అర్హత కార్డులతో కౌలురైతులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తిస్తాయని డిప్యూటీ తహసీల్దార్ కుమారస్వామి అన్నారు. రుణఅర్హత కార్డులకు కౌలురైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించేందుకు మండల కేంద్రంలో బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, భూ యజమాని నుంచి అంగీకారపత్రం, కౌలురైతు ఆధార్‌కార్డు, ఫోన్ నంబర్, ఫొటోతో కలిపి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అలాగే మండలంలోని తలవరం, పనస నందివాడ, కుమ్మరిగుంట, నీలానగరం, తెట్టంగి, చిన్నగోర, పెద్దూరు, బూరుగ, చలివేంద్రి, జె.గోపాలపురం రెవెన్యూ గ్రామాల్లో కూడా గ్రామసభలు నిర్వహించారు. కార్యక్రమాల్లో ఆర్ఐ ఎం.లక్ష్మణనాయుడు, వీఆర్‌ఓలు, అగ్రికల్చరల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.


గ్రామసభలో మాట్లాడుతున్న డిప్యూటీ తహసీల్దార్ కుమారస్వామి

తాగునీరు అందించేందుకు చర్యలు

● కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

పాలకొండ: నగర పంచాయతీలోని జగనన్న కాలనీలో చేపడుతున్న జల్‌జీవన్ మిషన్ పనుల ద్వారా తాగునీరు అందించేందుకు యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఎ. శ్యామ్‌ప్రసాద్ ఆదేశించారు. పట్టణంలోని జగనన్న కాలనీతో పాటు మండలంలోని ఎం.సింగుపురం గ్రామంలో బుధవారం పర్యటించారు. ముందుగా జగనన్న కాలనీలో ఇంటింటికీ కుళాయి ఏర్పాట్లను పరిశీలించి, నీటిపారుదల శాఖ ఇంజినీరింగ్ సిబ్బందికి సూచనలు అందించారు. అనంతరం ఎం. సింగుపురం గ్రామంలో పర్యటించారు. పీహెచ్‌సీని సందర్శించి రోగులకు అందిస్తున్న సేవలపై ఆరా తీశారు. గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలను సందర్శించి మధ్యాహ్న భోజనం అమలును పరిశీలించారు. అంకితభావంతో విధులు నిర్వహించాలని ఉపాధ్యాయులకు సూచించారు. అనంతరం మల్లివీడు గ్రామంలో పారిశుధ్య పనులు పరిశీలించారు. సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, అన్ని గ్రామాల్లోనూ పారిశుధ్య పనులు నిర్వహించాలని తెలిపారు. ఆయనతో పాటు మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.


జల్‌జీవన్ మిషన్ పనులు పరిశీలిస్తున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

సమన్వయంతో పనిచేయాలి

● ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి

కొమరాడ: అధికారులు సమన్వయంతో పనిచేసి మండల అభివృద్ధికి సహకరించాలని ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండలంలోని వివిధ శాఖల అధికారులతో బుధవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రజా సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాలని సూచించారు. గిరిజన గ్రామాల్లో రోడ్లు, రవాణా, మంచినీరు, విద్యుత్, తదితర మౌలిక సదుపాయాలు పూర్తిస్థాయిలో కల్పిస్తామన్నారు. అలాగే అంతరాష్ట్ర రహదారి మరమ్మతులతో పాటు పూర్ణపాడు–లాబేస్ వంతెన నిర్మాణం పూర్తిచేస్తామన్నారు. అంతకుముందు మండలంలోని కళ్లికోట గ్రామంలో ఏర్పాటు చేసిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని బుధవారం ఆమె ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ మల్లికార్జునరావు, నాయకులు శనపతి ఉదయ్‌శేఖర్ పాత్రుడు, గులిపిల్లి సుదర్శనరావు, దేవకోటి వెంకటినాయుడు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి